సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

జమ్మలమడుగు–తాడిపత్రి రహదారిపై ఓ లారీ భీబత్సం సృష్టించింది. వేగంగా వస్తూ గొర్రెల మంద పైకి దూసుకెళ్లింది. ఇద్దరు గొర్రెల కాపరులు మృతి చెందారు. -8లో



మహిళా సాధికారత కోసమే మిషన్ శక్తి పథకం

మహిళల సాధికారతే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించిందని జేసీ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 133 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన దిగువ పేర్కొన్న నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా పీలేరుకుచెందిన బి.హరితను, రాష్ట్ర ఎస్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా తంబళ్లపల్లెకు చెందిన శ్రీనివాసులునాయక్, రాష్ట్ర ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కోడూరుకు చెందిన ఎం .చంద్ర కుళాయప్పలను నియమించారు.

ఏకగ్రీవ ఎన్నిక

రాయచోటి టౌన్: రాష్ట్ర ఎన్జీవో అసోషియేషన్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడిగా బి. శ్రీనివాసులు రెండోసారి ఎంపికయ్యారు. మంగళవారం కడపలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రాయచోటి తాలూకా ఎన్జీవోల సంఘం నాయకులు తెలిపారు. శ్రీనివాసులుకు పలువురు అభినందనలు తెలిపారు.

బీడీఎస్‌లో గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న డాక్టర్ దేవిరెడ్డి శ్రావ్య

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయ ఈవో డివి రమణారెడ్డి కుమార్తె దేవిరెడ్డి శ్రావ్య బీడీఎస్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. 2021లో మెడిసిన్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం ఈమె ఎండీఎస్ చదువుతోంది. బీడీఎస్ (2021)లో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్ సాధించినందుకు మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో వైద్య విభాగం అధికారులు డాక్టర్ ఓపీ యాదవ్, డాక్టర్ పి. చంద్రశేఖర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌తో పాటు సిల్వర్ మెడల్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, బంధువులు శ్రావ్యకు శుభాకాంక్షలు తెలియచేశారు.

చిరుత హల్ చల్



ఎగువ చెన్నామర్రి పొలం వద్ద రక్తపు మరకలు

కురబలకోట: కురబలకోట మండలంలోని ఎగువ చెన్నామర్రి వద్ద చిరుత పులి ఆనవాళ్లు కలకలాన్ని సృష్టిస్తున్నాయి. మంగళవారం రాత్రి కట్టేసిన కుక్కను చిరుత చంపినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వివరాలు..హార్సిలీహిల్స్ పరివాహక ప్రాంతంలోని ఎగువ చెన్నామర్రికి చెందిన రెడ్డిశేఖర్ రెడ్డి ప్రతి రోజు రాత్రి సమయంలో పెంపుడు కుక్కను కాపలాగా పొలం వద్ద కట్టేసేవారు. మంగళవారం కూడా కట్టేశాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా కుక్క కన్పించలేదు. రక్తపు మరకలు కన్పించాయి. దీంతో భయాందోళనలకు గురయ్యారు. చిరుత కుక్కను చంపి తినేసి ఉంటుందని భావిస్తున్నారు. అటవీ శాఖ ఎఫ్‌బీఓ జయరాం స్థానికులను విచారించారు. చిరుత పాద ముద్రలను పరిశీలించారు. పొలాల వద్దకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. హార్సిలీహిల్స్ నుండి ఈ చిరుత వచ్చి ఉండవచ్చని బావిస్తున్నారు.

ప్రయాణికులకు సూపర్ కష్టాలు

- అనంతపురంలో సూపర్‌సిక్స్–సూపర్‌హిట్ కార్యక్రమం
- జిల్లాలోని ఐదు డిపోల నుంచి 350 బస్సులను పంపిన అధికారులు
- బస్సులు లేకపోవడంతో ప్రయాణానికి తప్పని తిప్పలు

సాక్షి రాయచోటి: కూటమి సర్కార్ కార్యక్రమం చేపడితే అందుకు సంబంధించి ఆయా పార్టీల కార్యకర్తలు ఖుషీ అవుతారేమోగానీ...ప్రజలకు మాత్రం బోలెడు కష్టాలు తప్పడం లేదు. ఎప్పుడు చూసినా ఏదో ఒక కార్యక్రమం పేరుతో బస్సులను తరలిస్తుండడంతో ప్రయాణికులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వందల సంఖ్యలో బస్సులను ప్రభుత్వ కార్యక్రమం పేరుతో తీసుకు పోవడంతో ప్రజలకు సూపర్ కష్టాలు ఎదురయ్యాయి. అనంతపురంలో కూటమి సర్కార్ సూపర్‌సిక్స్ సూపర్ హిట్ సభకు జిల్లాలోని వివిధ డిపోల నుంచి సుమారు 350కి పైగా బస్సులను తీసుకెళ్లడంతో ఉద్యోగులు, మహిళలు, ప్రజలు పడరాని పాట్లు పడ్డారు.

గంటల తరబడి తప్పని నిరీక్షణ

అన్నమయ్య జిల్లాలో ఐదు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ప్రతిరోజు రూట్ల వారీగా తిరిగే బస్సులు 482 వరకు ఉన్నాయి. అయితే సీఎంతోపాటు డిప్యూటీ సీఎం పాల్గొంటున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి బస్సులను తరలించారు. అనంతపురంలో సభ జరుగుతున్న తరుణంలో రాయలసీమ జిల్లాలోని పలు డిపోలతోపాటు అన్నమయ్య జిల్లా నుంచి భారీగా బస్సులను సమీకరించారు. దీంతో ప్రయాణికులు వద్దురా..బాబూ...ఈ ప్రయాణం అనడం కనిపించింది. మంగళవారమే బస్సులను అనంతపురానికి తరలించడంతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు చెప్పడానికి అలివి కాలేదు. ఉదయం నుంచి గంటల తరబడి బస్టాండ్లలో నిరీక్షిస్తే ఒకటి, అర వచ్చిన బస్సుల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దసరా, సంక్రాంతి పండుగల సమయంలో బస్సుల్లో సీట్ల కోసం ఎలాంటి అగచాట్లు పడతారో అంతకంటే రెట్టింపుగా ఇబ్బందులు పడటం కనిపించింది. కనీసం ముందస్తుగా బస్సులు ఉండవన్న సమాచారాన్ని ఆర్టీసీ అధికారులు ఇచ్చి ఉంటే ప్రయాణాన్ని వాయిదా వేసుకునే వారమని పలువురు లబోదిబోమంటున్నారు. మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు బస్టాండ్లలో రెండు, మూడు గంటలు కూర్చొన్నా తమ గమ్యస్థానాలకు వెళ్లే బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు అగ్గిమీద గుగ్గిలం అయ్యారు.



మదనపల్లె బస్టాండుకు బస్సులు రాకపోవడంతో వెనుదిరుగుతున్న ప్రయాణికులు



బస్టాండులో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

సభకు 350 బస్సులు

అనంతపురం సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో నిర్వహించిన సభకు సంబంధించి అన్నమయ్య జిల్లాలోని ఐదు డిపోల పరిధిలో సుమారు 350 బస్సులను తీసుకెళ్లారు. మదనపల్లె-1, 2, పీలేరు, రాయచోటి, రాజంపేట డిపోల పరిధిలో బస్సులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తీసుకెళ్లారు. దూర ప్రాంతాలకు వెళ్లేవి మినహా మిగతా బస్సులన్నీ తరలించడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. అమరావతి, ఇంద్ర, స్టార్ లైనర్ వంటి ఏసీ బస్సులు, సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సులు మినహా దాదాపు మిగతా బస్సులు చాలా వరకు అనంతపురం చేరాయి. ఏది ఏమైనా కూటమి సర్కార్ చేపట్టే ప్రతి కార్యక్రమం సందర్భంగా ప్రజలకు తిప్పలు తప్పడం లేదని పలువురు పేర్కొన్నారు.



మదనపల్లె బస్టాండులో బస్సు నిండినా మరింతమంది ఎక్కుతున్న దృశ్యం

జిల్లాకు స్వచ్ఛాంధ్ర అవార్డులు తీసుకురావాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి

రాయచోటి: ప్రభుత్వం పరిశుభ్రతకు అగ్రస్థానం ఇస్తున్న నేపథ్యంలో స్వచ్ఛాంధ్ర రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ఎంపికలో నిర్దేశించిన ప్రతి పారామీటర్‌లో వందశాతం అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలిసి స్వచ్ఛాంధ్ర అవార్డులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన పనిలో వెనుకబడితే సంబంధిత శాఖలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం నియోజకవర్గ స్పెషల్ అధికారులు నిర్దేశించిన పారామీటర్లపై లోటు పాట్లను గుర్తించి సంబంధిత శాఖలకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాలక్షేపంగా కాకుండా ఉత్సాహంగా పనిచేస్తే ముఖ్యమంత్రి నుంచి అవార్డు పొందే అవకాశం ఉంటుందన్నారు. అన్ని శాఖలు, అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేసి స్వచ్ఛ అన్నమయ్య జిల్లాకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సీపీఓ, డీఈఓ, ఐసీడీఎస్ పీడీ, డీపీఓ, డీఎంహెచ్ఓ పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్‌లో మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) వారు క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సలీం బాషా తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ పాసైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ రెజ్యూమ్‌తోపాటు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో కళాశాల ఆడిటోరియంలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

రూబిక్ క్యూబ్స్ మొజాయిక్ ఆర్ట్‌లో మదనపల్లె విద్యార్థి ప్రతిభ



మొజాయిక్ ఆర్ట్‌తో భారతదేశ పటం

మదనపల్లె రూరల్: పిట్ట కొంచెం..కూత ఘనం అన్న నానుడికి సరిగ్గా సరిపోతాడు మదనపల్లెకు చెందిన ఎం.సాయి కార్తికేయ సౌరవ్. వివిధ విభాగాల్లో పిల్లలు సాధించిన విజయాలను గుర్తించే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకోవడం సాధారణ విషయం కాదు. పట్టణానికి చెందిన సాయి కార్తికేయ సౌరవ్‌కు ఏడేళ్ల వయస్సులో 40 రకాల రూబిక్ క్యూబ్‌లను అత్యంత వేగంగా పరిష్కరించగలడం, 500 క్యూబ్‌లతో రూబిక్ క్యూబ్స్ మొజాయిక్ ఆర్ట్ చేయడం అతడికి వెన్నతో పెట్టిన విద్య. అతి చిన్న వయస్సులో అతడు చూపిన అసాధారణ ప్రతిభను గుర్తించి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేయడమే కాకుండా, గ్రాండ్ మాస్టర్ సర్టిఫికేట్‌ను అందజేశారు. మదనపల్లె పట్టణం కొత్తపేటలో నివాసం ఉంటున్న డాక్టర్.ఎం. సాయికిశోర్, పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. భార్య శ్రీ గృహిణి. వీరి కుమారుడు ఎం.సాయి కార్తికేయ సౌరవ్(7) బెంగళూరులోని హొరమావు ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. చిన్నప్పుడు క్యూబ్స్ పరిష్కారంపై సాయి కార్తికేయ శ్రద్ధను గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహించారు. దీంతో అతడు చిన్నవయస్సులోనే 40 రకాల రూబిక్ క్యూబ్‌ను వేగంగా పరిష్కరించడమే కాకుండా 500 క్యూబ్‌లతో ఈశ్వరుడు, సాయిబాబా, కృష్ణ, కార్తికేయ, రామ, హనుమాన్, దుర్గా, జాతీయపతాకం, ప్రధాని మోదీ, రతన్‌టాటా, ఆస్ట్రోనాట్, సునీతా విలియమ్స్, విరాట్ కొహ్లి, నారుటో కార్టూన్..మొజాయిక్ ఆర్ట్ ద్వారా చిత్రాలను ఆవిష్కరిస్తాడు. సాయి కార్తికేయ సౌరవ్ ప్రతిభను గుర్తించిన ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అతడి పేరును గ్రాండ్ మాస్టర్స్ వరల్డ్‌కింగ్స్ టాప్ రికార్డ్స్ 2025 జాబితాలో నమోదుచేస్తూ ప్రశంసాపత్రాన్ని, సర్టిఫికెట్‌ను పోస్టు ద్వారా మంగళవారం అందజేశారు.



మెడల్, ప్రశంసాపత్రంతో సాయి కార్తికేయ సౌరవ్

‘దేశం’లో రగడ!

- పుత్తా వర్సెస్ రెడ్డెమ్మ వర్గీయులు బలప్రదర్శన
- నూతన బార్ ఏర్పాటును అడ్డుకున్న కడప ఎమ్మెల్యే వర్గీయులు
- పరస్పర సవాళ్ల నేపథ్యంలో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయం



సాక్షి ప్రతినిధి, కడప: కడప టీడీపీలో అసమ్మతి పోరు ముదిరింది. కడప కేంద్రంగా పరస్పర బలప్రదర్శనల జోరు ఊపందుకుంది. కమలాపురం , కడప నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నేతల మధ్య రగడ తీవ్ర స్థాయికి చేరింది. వరుస వివాదాలు నేపథ్యంలో ఏకంగా టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠానికి ఎసరు పెట్టారు. అధ్యక్షుడి మార్పు జరగాల్సిందేనంటూ ఓ వర్గం మంకు పట్టుబట్టింది.

జిల్లా కేంద్రమైన కడపలో మునుపెన్నడూ లేని పరిస్థితులు కూటమి సర్కార్ 16 నెలల కాలంలో తెరపైకి వస్తున్నాయి. ‘మద్యం వ్యాపారం మా వర్గీయులే చేయాలంటూ’స్థానిక ఎమ్మెల్యే వర్గీయులు హుకుం జారీ చేయసాగారు. 30 ఏళ్లుగా మద్యం వ్యాపారంలో లక్ష్మిరెడ్డికి చెందిన రెండు బార్లు బలవంతంగా స్వాహా చేశారు. తాజాగా 27 బార్ల లైసెన్స్‌కు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తే కేవలం 14 బార్లుకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. 13 బార్లకు సంబంధించి టెండర్లు పెండింగ్‌లో ఉన్నాయి. కడప కోటిరెడ్డి సర్కిల్ సమీపంలో బార్ ప్రారంభోత్సవానికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే మాధవీరెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. ఇక్కడ బార్ పెట్టొద్దంటూ హంగామా చేశారు. ఇరువర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి బ్యానర్లతో వాహనాల్లో వచ్చిన కొంతమంది అక్కడి చేరుకొని పరస్పర సవాళ్లు చేసుకున్నారు. దీంతో కడప ఎమ్మెల్యే వర్గీయులు అక్కడి నుంచి జారుకున్నట్లు సమాచారం. కాగా, జిల్లా కేంద్రంలో నియంతృత్వ పోకడలకు చెక్ పెట్టాలనే దిశగా టీడీపీ నేతలు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ అధ్యక్ష పీఠానికి ఎసరు



శ్రీనివాసులరెడ్డి

జిల్లా కేంద్రమైన కడపలో ఏకపక్ష చర్యలకు చెక్ పెట్టాలని తెలుగుదేశం పార్టీలో కొంతమంది నడుం బిగించారు. అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం మార్పు చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డికి తోడుగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఉండడంతో ప్రజాస్వామ్య పరిస్థితులను కాలరాస్తున్నారని కొంతమంది టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆమేరకు ఇటీవల చోటుచేసుకున్న కొన్ని సంఘటనలను ఉదహరించినట్లు తెలుస్తోంది. పొలిట్‌బ్యూరో సభ్యుడుగా జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులరెడ్డికి రెండు పదవులు ఉన్న నేపథ్యంలో అధ్యక్ష పీఠం తప్పించాలని కోరినట్లు సమాచారం. ఆమేరకు టీడీపీ అధిష్టానం సైతం ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. కాగా, జిల్లా అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుందనే అన్వేషణలో జమ్మలమడుగు ఇన్‌చార్జీ చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. టీడీపీలో భూపేష్‌రెడ్డి అందరికీ ఆమోదయోగ్యుడుగా నిలువనున్నట్లు అధిష్టానం అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

ప్రతిభకు ఉపకారం

- ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు వేళాయె
- సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తు స్వీకరణ

మదనపల్లె సిటీ: ప్రభుత్వ బడుల్లో గ్రామీణ,పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే అధికంగా చదువుతుంటారు. చాలా మంది విద్యార్థులు ఆర్థిక కారణాలతో మధ్యలో బడి మానేసి విద్యకు దూరవుతున్నారు. దీంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు చదువులు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఉపకారవేతనం అందిస్తూ చేయూతనిస్తోంది. ఇందుకు ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఇందులో అర్హత సాధిస్తే తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్లు ఏటా రూ.12 వేల చొప్పున ఉపకారవేతనం అందుతుంది. దరఖాస్తుకు ఈనెల 4నుంచి 30వ తేదీ తుది గడువు విధించారు. పరీక్ష డిసెంబర్ 7వతేదీ నిర్వహిస్తారు.

ఎవరు అర్హులు: ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ 7 వ తరగతిలో ఓసీ,బీసీలైతే 55 శాతం, ఎస్సీ,ఎస్టీలైతే 50 శాతం మార్కులు లేదా దానికి సమానమైన గ్రేడ్ పొందిన వారు అర్హులు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదు. ప్రభుత్వ ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్‌గా చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలలు ,రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంది. ఈ ఏడాది ఎనిమిదో తరగతి విద్యార్థులు WWW.bse.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



పాఠశాలలో విద్యార్థులు (ఫైల్)

ఏడాదికి రూ.12 వేలు

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నవారు ఈ పారితోషకానికి ఎంపికైతే 9 నుంచి 12వ తరగతి వరకు ఉపకారవేతనం అందుతుంది. ఏడాదికి రూ.12వేల చొప్పున మొత్తం రూ.48 వేలు ఇవ్వనున్నారు.విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా తీసి వివరాలు సమర్పిస్తే నేరుగా వారి ఖాతాలో జమచేస్తారు.

పరీక్ష విధానం



రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని విభాగాల వారీగా అర్హుల జాబితాను రూపొందిస్తారు. ఇందులో రెండు ప్రశ్నపత్రాలలు ఉంటాయి. మూడు గంటల పాటు పరీక్ష సమయాన్ని కేటాయించారు.

మెంటల్ ఎబిలిటీ పరీక్ష: వెర్బల్, నాన్ వెర్బల్, రీజనింగ్ నుంచి 90 ప్రశ్నలుంటాయి. దీనికి 90 మార్కులు

స్కాలిసిస్ అప్టిట్యూట్ పరీక్ష: ఇందులో 7,8 తరగతుల స్థాయిలో నేర్చుకున్న గణితం, సామాన్య,సాంఘిక విషయాలపై ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 180 మార్కులు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రధానోపాధ్యాయులు ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి, వారితో దరఖాస్తు చేయించడమే కాకుండా పరీక్ష రాసేలా ప్రోత్సహించాలి. ఉపాధ్యాయులు ప్రత్యేక సమయాన్ని కేటాయించి పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేయాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రశ్నపత్రాలు సాధన చేయాలి



జాతీయ ఉపకార వేతనాల పోటీ పరీక్ష పేద,మధ్య తరగతి విద్యార్థులకు వరం. 7,8 తరగతుల విషయాలతో పాటు రీజనింగ్ కోసం మాదిరి ప్రశ్నాపత్రాలు సాదన చేయాలి. –పురం రమణ, టీచర్, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

గుర్రంకొండ: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని తరిగొండలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో పచ్చరొట్ట, జీలుగు, జనుము వంటి ఎరువులను వినియోగించడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. వరి సాగు చేసే ముందు పొలంలో వేప, కానుగ ఆకు వేసి కలయదున్నుకోవాలన్నారు. తద్వారా పంటకు చీడపీడలు సోకవని, మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎకరం పంటకు యూరియా ఒకటి లేదా రెండు బస్తాల కంటే ఎక్కువగా వినియోగించవద్దన్నారు. అధిక యూరియా వినియోగం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతాయన్నారు. తద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియాను పంటసాగులో ఉపయోగించవచ్చన్నారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ఏడీఏ నాగప్రసాద్, ఏవో నాగరత్నమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు కౌన్సెలింగ్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ నియామకాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెచ్ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందు పరిచామన్నారు.

క్లుప్తంగా

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : బుధవారం ముష్టూరు గ్రామానికి చెందిన చిన్నఅప్పోడు(60) స్థానికంగా సారా తయారుచేసి విక్రయిస్తుండడంతో అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

భార్య కోసం సెల్ టవర్ ఎక్కిన భర్త



సెల్ టవర్ ఎక్కిన కళ్యాణ్

రైల్వేకోడూరు అర్బన్ : తన భార్య ఇంటికి రాలేదని పట్టణంలోని ధర్మాపురానికి చెందిన బాలయ్య కుమారుడు పవన్ కళ్యాణ్ సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. కల్యాణ్ పదేళ్ల కిందట లతను వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో లత పుట్టింటికి వెళ్లిపోయింది. ఎంత అడిగినా భార్య రాకపోవడంతో దిగులు చెందిన భర్త పట్టణంలోని పాత తహసీల్దారు కార్యాలయం సమీపంలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. తహసీల్దారు అమర్‌నాథ్, ఎస్సై లక్ష్మప్రసాద్‌రెడ్డి చేరుకొని బాధితుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కుటుంబసభ్యులను పిలిపించి మాట్లాడతామని హామీ ఇవ్వడంతో కిందికి దిగి వచ్చాడు.

ఆగిన ఐచర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి



తండ్రి మృతదేహంవద్ద రోదిస్తున్న దేవేంద్ర

సంబేపల్లె : సిగ్నల్ లైట్లు వేయకుండా పిన ఐచర్‌ను ఢీకొని జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గుట్టపల్లె సమీపంలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లా రామాంజులు (52) బుధవారం మృతిచెందారు. కలకడ మండలం బాటవారిపల్లెకు చెందిన రామాంజులు ద్విచక్ర వాహనంలో బుధవారం తెల్లవారుజామున రాయచోటికి వసుత్నారు. గుట్టపల్లె సమీపంలోకి రాగానే సిగ్నల్ లైట్లు లేకుండా జాతీయరహదారిపై ఆపిన ఐచర్ వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రామాంజులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాయచోటి ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు దేవేంద్ర ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని పాయిరామన్న వీధిలో కాపురముంటున్న సోమ శేఖర్(20) డిగ్రీ వరకు చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది, ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామసముద్రం మండలంలో చెంబుకూరుకు చెందిన మహేష్ భార్య సునీత (25)కు జ్వరంతో బాధపడుతూ, మద్యం మత్తులో ఇంటికి వచ్చిన భర్త మహేష్‌ను ఆసుపత్రికి తీసుకువెళ్లాల్సిందిగా కోరింది. మహేష్ కుదరదనడంతో మనస్తాపం చెంది, జ్వరానికి తెచ్చుకున్న మాత్రలు ఒకేసారి మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రబలుతున్న జ్వరం... వణుకుతున్న జనం



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు ఓర్పువెంకటమ్మ. అట్లూరు మండలం వలస పాలెం గ్రామానికి చెందిన ఈమె గత 5 రోజులుగా జ్వరం, ఒళ్లునొప్పులతో బాధపడుతోంది. స్థానిక పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. ఇక్కడ వైద్యుల కొరతతో గంటల తరబడి వేచి ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది.

- అన్నింటా ప్రబలుతున్న విష జ్వరాలు
- కిక్కిరిసిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు
- ప్రభుత్వాస్పత్రిలో వేధిస్తున్న వైద్యుల కొరత



ప్రభుత్వాసుపత్రిలో ఓపీ కోసం బారులు తీరిన జ్వరపీడితులు



చిన్న పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

బద్వేలు అర్బన్/ప్రొద్దుటూరు క్రైం : బద్వేల్ పట్టణంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఏ వార్డులో చూసినా ఇంటికి ఒకరు, ఇద్దరు చొప్పున జ్వర పీడితులు చికిత్సకు రావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. వైద్యుల కొరత ఉండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజుల్లో బద్వేల్ ప్రభుత్వాసుపత్రిలో 250 నుండి 400 ఓపీ నమోదవుతుండటం పరిస్థితికి అద్దంపడుతోంది. ఏ ప్రైవేటు ఆసుపత్రి చూసినా జ్వరపీడితులు దర్శనమిస్తున్నారు. ఆస్పత్రి కిటకిటలాడుతున్నా తగినంతమంది వైద్యులు లేకపోవడం రోగులకు శాపంగా మారింది. ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో 12 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ఆరుగురే ఉన్నారు. వీరిలోనూ ఒకరు డిప్యుటేషన్‌పై వారంలో రెండు రోజులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీనికి తోడు రక్త పరీక్షలు నిర్వహించే యంత్రం మరమ్మతులకు గురికావడంతో రోగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రక్తనమూనాలు సేకరించి గాంధీనగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో పరీక్ష చేయిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు.

కిక్కిరిసిన చిన్నపిల్లల వార్డు

ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిలో రోజూ సుమారు 1100 దాకా ఓపీ నమోదవుతోంది. మరో వైపు రాజుపాళెం, కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోనూ ఓపీ పెరిగింది. కొన్ని రోజులుగా రాత్రింబవళ్లు వర్షాలు పడుతుండడం, పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో పలువురు జ్వరాల బారిన పడి ఆస్పత్రికి వస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిట లాడుతున్నాయి. ఎక్కువమంది చిన్నారులు జ్వరం, జలుబు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో చిన్నపిల్లల వార్డు కిటకిటలాడుతోంది. 20 మంచాలు మాత్రమే ఉండడంతో 30 మంది చిన్నారులు చికిత్స తీసుకుంటున్నారు. మంచాల కొరత కారణంగా ఒక్కో మంచంలో ఇద్దరిని పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు. ప్రైవేటుగా మరింతమంది చికిత్స పొందుతున్నారు. రక్త పరీక్షల కోసమే వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

జ్వరంతో ఇబ్బంది పడుతున్నాం



గత మూడు రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నా. చికిత్స చేయించుకుంటున్నా జ్వరం తగ్గడం లేదు. మా వీధిలో చాలా మందికి జ్వరాలు వచ్చాయి. ఏ జ్వరమో అర్థం కావడం లేదు.

– రమణమ్మ, ఎగువ బ్రాహ్మణవీధి, బద్వేల్

గంటల తరబడి నిరీక్షణ



ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. తగినంత మంది వైద్యులు లేని కారణంగా సకాలంలో సేవలు అందడం లేదు. ఐదు రోజులుగా జ్వరం వస్తూనే ఉంది. మందులు తీసుకుంటున్నా తగ్గడం లేదు.

– వెంకటసుబ్బయ్య, రాజుగారివీధి, బద్వేల్

చిన్న పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



చిన్న పిల్లల్లో దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరు డయేరియాతో బాధపడుతున్నారు. ముందు జాగ్రత్తగా కాచి చల్లార్చిన నీటిని పిల్లలకు తాగించాలి. ముఖ్యంగా దోమలు కుట్టకుండా రాత్రివేళల్లో దోమ తెరలను వాడాలి. చల్లటివి కాకుండా వేడి పదార్థాలను భుజించాలి. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే హాస్పిటల్‌కు వెళ్లాలి.

– డాక్టర్ ఆనంద్‌బాబు, చిన్నపిల్లల వైద్యుడు, జిల్లా ఆస్పత్రి

మహిళా సాధికారత కోసమే మిషన్ శక్తి పథకం



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : మహిళల భద్రత, సాధికారత పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించిందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. రాయచోటి కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా మిషన్ శక్తి పథకంలో భాగంగా సంకల్ప కార్యక్రమాన్ని ఈ నెల 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. మహిళల భద్రతకు చట్టాలను చేయడం జరిగిందని, వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం భేటీ బచావో, భేటీ పడావో, మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మహిళలు–కౌమార బాలికల ఆరోగ్యం, పోషకాహారం, సమాజంలో జరిగే క్రైమ్ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిణి హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ శివదాసన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసీని, జాతీయ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వ విధానాలు బలహీన పరుస్తున్నాయని సీపీఎం రాజ్యసభ సభ్యుడు శివదాసన్ తీవ్రంగా విమర్శించారు. సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి అధ్యక్షతన బుధవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల సెమినార్ లో సీపీఎం రాజ్యసభ్యులు శివదాసన్ మాట్లాడుతూ దేశంలో యూనివర్సిటీలలో రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరని, విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోయాయని అన్నారు. ఆరోగ్య రంగంలో కేటాయింపులు తగ్గిపోవడం వల్ల చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు కూడా నియంత్రించలేని స్థితి నెలకొన్నదన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి టీడీపీ, వైఎస్సార్ సీపీ మద్దతు ఇస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాలు విగ్రహాలకు వందల కోట్లు ఖర్చు పెడుతున్నాయని, కానీ స్కూళ్లను, హాస్పిటల్స్ ను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై, ప్రజాప్రతినిధులపై ఉందని, పెన్షన్ సదుపాయం అన్నది రాజ్యాంగ హక్కు అని పాలకులు గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అవధానం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి రాజా, నాగమునిరెడ్డి, రాజశేఖర్ రాహుల్, రవితేజ, ఎస్.శివశంకర్ , రామ్మూర్తి నాయుడు, అజీజ్, లలిత, రామకృష్ణా రెడ్డి, సుధాకర్, వెంకటరామరాజు, సుబ్బారెడ్డి, డి.మొహమ్మద్, ఎ. సుబ్బారావు, వి.రామంజులరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత శ్రీకాంత్ అక్రమ అరెస్టు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : దువ్వూరు మండలంలో వైఎస్సార్ సీపీ నేతలపై అధికార పార్టీ నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తప్పుడు కేసులు పెట్టి పోలీసులు అక్రమ అరెస్టులు కొనసాగిస్తున్నారు. గత నెల 31న కానగూడూరుకు చెందిన టీడీపీ నేత తోట శేషయ్యపై దాడి చేసి తిట్టాడని మండలంలోని ఇడమడక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నగరి శ్రీకాంత్‌పై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారు. అప్పటి నుండి నాలుగు పర్యాయాలు శ్రీకాంత్ స్థానిక పోలీసులకు ఫోన్ చేసి సార్ తాను స్టేషన్‌కు వస్తానని.. స్టేషన్ బెయిల్ ఇవ్వాలని తెలిపారు. స్పందించని పోలీసులు కాలయాపన చేస్తూ వచ్చారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో, ఎలాగైనా శ్రీకాంత్‌ను జైలుకు పంపాల నే ఉద్దేశంతో శ్రీకాంత్ భార్యకు ఆరోగ్యం బాగలేక కర్నూలు ఆస్పత్రిలో ఉంటే బు ధవారం అక్కడికి వెళ్లి బలవతంగా అరెస్టు చేసి దువ్వూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన కేసులో తప్పుడు సెక్షన్లు జోడించి మైదుకూ రు కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. ఇప్పటికే శ్రీకాంత్ 20 ఏళ్లుగా నడిపే డాబాను, ఆయన బావ ముద్దం వీరభద్రుడుకు చెందిన డాబాను అధికార పార్టీ నేతలు కూల్చివేశారు. ఇపుడు అక్రమ కేసు పెట్టి కుట్ర చేస్తున్నారని నేతలు ఆరోపించారు.

కూలీల ఆటో బోల్తా

ఎనిమిది మందికి గాయాలు



గాయపడిన ఆసిఫ్

కురబలకోట : కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఎనిమిది మంది కూలీలు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు..కురబలకోట మండలం ముదివేడులో టమాటాలు కోసేందుకు మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన కూలీలు జె.శ్రీనివాసులు (38), రమణమ్మ (50), సరస్వతి (48), రామసుధ (29), లక్ష్మి దేవి (35), ఎం.శ్రీనివాసులు (40), రవనమ్మ (40) ఆటోలో బుధవారం ఉదయం బయలు దేరారు. ముదివేడు దగ్గరగా వెళుతుండగా కృష్ణారెడ్డిగారిపల్లె వద్ద ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్‌ను తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో ఆటోలోని కూలీలంతా కిందపడి గాయపడ్డారు. వారిని 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనంపై నుంచి పడి.. మరొకరికి

మదనపల్లె రూరల్ : వాహనంపై నుంచి పడి ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. చిత్తూరు జిల్లా పుంగనూరు నక్కబండ్లకు చెందిన దస్తగిరి కుమారుడు ఆసిఫ్(28), స్థానికం మండీలో పనిచేస్తున్నారు. ఐచర్ వాహనంలో మదనపల్లె నుంచి వెళ్తుండగా.. బైపాస్ రోడ్డులోని రాయల్ ఫర్నిచర్ సమీపంలో మరో కారు అకస్మాత్తుగా అడ్డుగా వచ్చింది. కంగారుపడ్డ ఐచర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనంపై కూర్చున్న ఆసిఫ్ అదుపు తప్పి పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం బాధితుడిని బెంగళూరుకు తీసుకువెళ్లారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

ఇద్దరు వ్యక్తుల దుర్మరణం



లారీ దూసుకెళ్లడంతో మృతిచెందిన గొర్రెలు





మృతిచెందిన వెంకటేశ్వర్లు, నరసింహులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు–తాడిపత్రి రహదారిపై ఓ లారీ భీబత్సం సృష్టించింది. వేగంగా వస్తూ రహదారిపై వెళ్తున్న గొర్రెల మంద పైకి దూసుకెళ్లింది. వాటిని మేపే ఇద్దరు గొర్రెల కాపరులపై వెళ్లడంతో వారు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. 15 గొర్రెలు మృతి చెందాయి. ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు.. నంద్యాల జిల్లా అళ్లగడ్డ తాలూకా నల్లవాగుపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు(45), ఆలమూరు గ్రామానికి చెందిన నరసింహులు(35) తమ యజమాని క్రిష్టయ్యకు చెందిన గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి గండికోట ప్రాంతంలో గొర్రెలు మేపి స్వగ్రామానికి యజమాని క్రిష్టయ్యతో కలిసి బయలుదేరారు. బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో బైపాస్ రోడ్డులో వెనుకవైపు నుంచి అతి వేగంగా గుర్తుతెలియని లారీ దూసుకువచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందగా, నరసింహులును ప్రొద్దుటూరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందారు. యజమాని క్రిష్టయ్య ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. 15 గొర్రెలు మృతిచెందడంతో దాదాపు రూ. 2.50 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని, మృతుల కుటుంబాలకు అన్యాయం జరిగిందని క్రిష్టయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి బోరున విలపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ తెలిపారు.

అక్షరమే ఆయుధం

ఎమర్జెన్సీలో కూడా ఇలా లేదు..



నేను ఎమర్జెన్సీ రోజులను ప్రత్యక్షంగా చూసిన అనుభవంతో చెబుతున్నాను. ఆరోజుల్లో పత్రికలపై సెన్సార్‌షిప్ మాత్రమే ఉండేది. ఇప్పటిలాగా సాక్షి పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై ప్రత్యక్ష దాడులకు పా ల్పడటం, కేసులు నమోదు చేయడం వంటివి చూడలేదు. వ్యక్తులు లేదా ప్రభుత్వంపై ఏవైనా వ్యతిరేక వార్తలు వచ్చిన సందర్భాల్లో వాటిని ఖండించాలి. నిజానిజాలేవో తెలియజేస్తూ ప్రకటనలు ఇవ్వాలి. ఒకవేళ పత్రికా యాజమాన్యం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి పద్ధతులను పక్కకు నెట్టి దాడులు, 'సాక్షి' ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం అంటే అది పూర్తిగా అప్రజాస్వామికమవుతుంది. ఇలాంటి ధోరణులను ప్రజాస్వామిక వాదులు ముక్తకంఠంతో ఖండించాలి.

– సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, రాయలసీమ కార్మిక కర్షక సమితి, కడప

పత్రికా స్వేచ్ఛపై దాడిగా పరిగణించాలి



రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడిగానే పరిణించాల్సి ఉంటుంది. ఓ నాయకుడు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన విషయాలను వార్తగా ప్రచురిస్తే కేసు నమోదు చేయడం గతంలో ఎన్నడూ చూడలేదు. డీఎస్పీల పదోన్నతుల్లో లంచాలు చోటుచేసుకున్నాయనే కథనంపై 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై వరుస కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను కోరుకునే వారంతా తీవ్రంగా ఖండించాల్సిన విషయం. ఒకవేళ 'సాక్షి'లో తప్పుడు కథనాలు ప్రచురితమయ్యాయని భావిస్తే వివరణ ఇవ్వాలి. నిజాలేవో వెల్లడించాలి. అంతేగానీ కేసులు, దాడులకు దిగడం రాజ్యాంగ హక్కులను కాలరాయడమే అవుతుంది.

– పి.రామసుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకుడు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన ఉన్నట్లు లేదు



రోజురోజుకూ రాష్ట్రంలో పత్రికలపై దాడులు పెచ్చరిల్లిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి వంటి అంశాలను వెలుగులోకి తీసుకు వస్తున్న 'సాక్షి'పై ప్రభుత్వం కక్షగట్టి దాడులు చేయిస్తోంది. ఓ ప్రెస్‌కాన్ఫరెన్స్ వార్తను రాసినందుకు ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే, రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ ఎలా ఉందో అర్థమవుతుంది. 'సాక్షి'లో వచ్చిన వార్తలకు ఖండన లేదా వివరణ లాంటివి ఇవ్వకుండా ఎడిటర్‌పై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేయాలనుకోవడం తగదు. పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామిక పాలన ఉన్నట్లు కనిపించడం లేదు. ఇలాంటి ప్రభుత్వ ధోరణులను ప్రతి ఒక్కరూ ఖండించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి.

– సి.వెంకటరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

హైవేపై తప్పిన ప్రమాదం



బోల్తాపడిన ఐచర్ వాహనం

సిద్దవటం : బియ్యం రవాణా చేస్తున్న ఐచర్ హనం అతి వేగంగా వస్తూ మండలంలోని కడప–చెన్నై జాతీయ రహదారిపై చర్చి వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. రహదారికి అడ్డంగా ఉన్న వాహనాన్ని తొలగిస్తున్నామని, క్రాసింగ్‌లో వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

భూమి కోసం ఘర్షణ



భూవివాదంలో గాయపడిన ప్రవీణ్‌కుమార్

కలకడ : భూమి కోసం జరిగిన ఘర్షణలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని కొత్తపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్–ప్రసాద్‌రెడ్డిలకు భూవివాదం ఉంది. బుధవారం ఈ విషయమై మాటా మాటా పెరిగి ఘర్షణకు దిగారు. దీంతో ప్రవీణ్‌కుమార్‌పై కొడవలితో ప్రసాద్‌రెడ్డి, సునీతలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వాల్మీకీపురం ప్రభుత్వం ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్



సామాజిక ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

రామసముద్రం : అక్రమాలకు పాల్పడిన ఎలవానెల్లూరు, కురిజల ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిసైడింగ్ అధికారి నందకుమార్ రెడ్డి తెలిపారు. రామసముద్రం తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. నందరకుమార్‌రెడ్డి మాట్లాడుతూ 1 ఏప్రిల్, 2024 నుంచి 31 మార్చి 2025 వరకు జరిగిన వివిధ రకాల పనులపై సామాజిక తనిఖీ జరిగిందన్నారు. గడచిన ఏడాదిలో 1287 పనులకు రూ.9.63 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఉపాధి సిబ్బంది నుంచి రూ.31,365 వేలు, రైతుల నుంచి రూ.1,07,113 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎస్టీఎం లోకేశ్వర్ రెడ్డి, వెంకయ్య, గఫూర్, మాధవి, గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కోసం వెళ్తూ... కారు ఢీకొని వ్యక్తి మృతి



కారు ఢీకొని మృతి చెందిన మస్తాన్

మదనపల్లె రూరల్ : ఇంటింటికీ బియ్యం వాహనం ప్రభుత్వం రద్దు చేయడంతో రేషన్ బియ్యం తెచ్చుకోవాలని వెళ్తూ కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందగా, అతని మనవరాలు గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. బి.కె.పల్లెలో చిల్లర దుకాణం నిర్వహిస్తున్న బుడెన్‌సాబ్ కుమారుడు మస్తాన్(59) స్థానిక రేషన్ దుకాణానికి, మనవరాలు సమీహకౌసర్(09)తో కలసి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. బైపాస్ రోడ్డులోని చంద్ర కాలనీ వద్ద, అనంతపురం నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మస్తాన్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లగా, మనవరాలు గాయపడింది. స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన ఆసుపత్రి వైద్యులు మస్తాన్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. కాగా మృతునికి భార్య హబీబున్నీసా, ఇద్దరు కుమార్తెలు ఓ కుమారుడు ఉన్నారు.

మిలటరీ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి సిటీ : రాష్ట్రీయ మిలటరీ స్కూళ్లలో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు అక్టోబర్ 9వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి బుధవారం తెలిపారు. ఇతర వివరాలకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ స్కూల్, లేదా 86888 88802 / 93999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.